సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ၊ 23 ၊ అక్టోబర్ ၊ 2023



లేపాక్షిలో పర్యాటక సందడి

దుర్గాష్టమిని పురస్కరించుకుని ఆదివారం లేపాక్షి ఆలయం పర్యాటకులతో కిక్కిరిసింది.

IIలో



డిజిటలైజేషన్‌తో దోపిడీకి చెక్

ఔషధ దుకాణాలపై పర్యవేక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రికార్డుల నిర్వహణ తప్పనిసరి చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది.

IIలో

గరిష్టం/కనిష్టం
34.0°/21.0°

జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోత నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

చూసిన కనులదే భాగ్యము!



కదిరి టౌన్: జిల్లాలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఆలయాలతో పాటు ప్రత్యేక మంటపాల్లో కొలువుదీర్చిన అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆదివారం రాత్రి వేంకటేశ్వర స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణ మార్మోగింది కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుఖ సంతోషాలు సిద్ధించాలి

- ప్రజలకు కలెక్టర్, ఎస్పీ విజయదశమి శుభాకాంక్షలు

పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అందరిపైనా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవభక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనుకున్న కార్యాలన్నీ పూర్తై, సుఖ సంతోషాలు సిద్ధించాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

హోరాహోరీగా ఎడ్ల బండ్ల పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం పంచాయతీ నడింపల్లి సమీపంలో ఆదివారం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు హోరాహోరీగా జరిగాయి. మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ బహుమతి నిరుమామిడికి చెందిన వంశీ ఎద్దులకు రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి గుమ్మయ్యగారిపల్లికి చెందిన నవీన్‌కుమార్ రెడ్డికి రూ. 20 వేలు, తృతీయ బహుమతి కొత్తచెరువు రామచంద్రకు రూ.10 వేలు అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన కొత్తచెరువు వెంకటేష్ రూ.5 వేలు అందుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల స్వాధీనం



పట్టుబడిన పేలుడు పదార్థాలతో పోలీసులు

నల్లచెరువు: మండల పరిధిలోని బాలేపల్లి తండా సమీపంలోని క్వారీలో పోలీసులు భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ లింగన్న తెలిపిన మేరకు.. ఆదివారం క్వారీలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన ఆసిక్ అనే వ్యక్తి నుంచి 100 డిటోనేటర్లు, 190 జెలిటిన్ స్టిక్స్, 4 బండిల్ల వైరు, 4 ప్లాస్టిక్ కవర్లు, నల్లని గన్ పౌడర్, 2 మెగ్గర్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బత్తలపల్లిలో విద్యుద్దీప కాంతులతో కొత్త శోభ సంతరించుకున్న అమ్మవారి ఆలయం



పూజాసామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న హిందూపురం ప్రధానవీధి



ధర్మవరంలో పూలు, టెంకాయలు కొనుగోలు చేస్తున్న జనం

దసరా వచ్చిందయ్యా..!

జిల్లా అంతటా దసరా సందడి నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా వచ్చే విజయదశమి వేడుకల కోసం విద్యుద్దీప కాంతులతో అమ్మవారి ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. జగన్మాత విభిన్న అలంకారాలతో శోభాయమానంగా సాగిన దసరా మహోత్సవాలు సోమవారం సాయంత్రం శమీ దర్శనంతో ముగియనున్నాయి. పర్వదినం సందర్భంగా పూజాసామగ్రి, దుస్తులు, కిరాణా తదితర సరుకుల దుకాణాలు కొనుగోలుదారులతో ఆదివారం కిటకిటలాడాయి. పూల ధరలు కొండెక్కి కూర్చున్నా జనం కొనుగోలు చేశారు. అరటి పట్టలు, పండ్లు, టెంకాయల అంగళ్లు కిక్కిరిశాయి.

– సాక్షి బృందం

ప్రగతి కేక.. ఓర్వలేక!

- ప్రజల సంతోషాన్ని ఓర్వలేని ప్రతిపక్షాలు
- ధర్మవరంలో అలజడికి కుట్రలు
- జనం దృష్టి మరల్చేందుకు కుయుక్తులు



ధర్మవరం ముఖచిత్రం

ధర్మవరం: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకులు ఓర్వలేకపోతున్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వ లేక నానా యాగీ చేస్తున్నారు. ప్రజల్లో ఉనికి చాటుకునేందుకు వ్యక్తిగత దూషణలకూ పాల్పడుతున్నారు.

- జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి సమీప బంధువైన రాజారెడ్డికి, ఈడిగ వినయ్‌తేజ్ గౌడ్ అనే వ్యక్తికి మధ్య వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. మూడు రోజుల క్రితం ధర్మవరం జనసేన పార్టీ కార్యాలయం సమీపంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఈ క్రమంలోనే రాజారెడ్డి గాయపడ్డారు. గొడవ విషయం తెలిసిన 2 నిమిషాల్లోనే ఘటనా స్థలికి చేరుకున్న రూరల్ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ క్షతగాత్రుడిని స్వయంగా పోలీసు వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స చేయించారు. తన ప్రాణాలు కాపాడారని బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. జరిగింది ఇదయితే.. చిలకం మధుసూదన్ రెడ్డి మాత్రం కొత్త పల్లవి అందుకున్నాడు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై బురద జల్లేందుకు యత్నించాడు.

'చిలక'ం పలుకులు.. జనం నవ్వులు

టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ధర్మవరం నియోజకవర్గ సీటు ఆశిస్తున్న చిలకం మధుసూదన్ రెడ్డి ఎలాగైనా ప్రజలను ఆకర్షించాలని రచ్చ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలో అశాంతి నెలకొల్పేందుకు నానా యాగీ చేస్తున్నారు. ఎక్కడ చిన్న గొడవ జరిగినా ఎమ్మెల్యేకు ఆపాదించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అందులో భాగంగానే ఇటీవల తన బంధువైన ఓ వ్యక్తి వ్యక్తిగత కారణాలతో మరో వ్యక్తితో గొడవ పడితే దాన్నీ ఎమ్మెల్యేపై రుద్దేందుకు యత్నించాడు. అయితే, వాస్తవాలు బయటకు రావడంతో జనం ఎదుట నవ్వులపాలయ్యాడు. ఇలాగే, కొన్ని రోజుల క్రితం ధర్మవరం పట్టణంలో ఓ పెద్ద షాపింగ్ మాల్ ఏర్పాటైతే.. చిరు వ్యాపారుల వ్యాపారాలు దెబ్బతింటాయంటూ రభస చేసే ప్రయత్నం చేశాడు. అయితే, కుట్ర విషయం గ్రహించి వ్యాపారులు సహకరించకపోవడంతో ఆ ప్లాన్ కూడా బెడిసికొట్టింది.

అభివృద్ధితోనే సమాధానం..

ప్రతిపక్షాల కుట్రలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతున్నారు. నిత్యం 'గుడ్‌మార్నింగ్' పేరుతో ప్రజలతో మమేకమవుతున్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలోనే రూ. 2,283 కోట్లను పేదల ఖాతాల్లో జమ చేయించి రికార్డు సృష్టించారు. దాదాపు రూ.6 వేల కోట్లకు పైగా నిధులతో ఆర్‌ఓబీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, నాడు–నేడు, డబుల్ లైన్ రహదారులు, నేషనల్ హైవే, రిజర్వాయర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు ప్రతిపక్షాలు ఎంతలా రెచ్చగొడుతున్నా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం కోల్పోకుండా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. గత టీడీపీ హయాంతో పోలిస్తే నియోజకవర్గంలో నేడు గణనీయంగా తగ్గిన నేర గణాంకాలే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు



ధర్మవరం డివిజన్‌లో పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంది. శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇటీవల పట్టణంలో రాజారెడ్డిపై జరిగిన దాడి ఘటనపై పోలీసులు సత్వరం స్పందించి ప్రాణాలు కాపాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులు వినయ్ తేజ్‌గౌడ్, విష్ణు, హరినాథ్‌తో సహా 10 మందిపై కేసు నమోదు చేశాం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదు. అయినప్పటికీ ప్రతిపక్ష పార్టీల నాయకులు పోలీసులు పట్టించుకోలేదని రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదు.

– టి. శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. ఈ మేరకు జీఓ 2072ను ఆదివారం జారీ చేసింది. విజయవాడ టూరిజం ఆర్జేడీగా ఉన్న వక్కా శ్రీనివాసులరెడ్డిని గుంతకల్లు ఆర్డీఓగా నియమించారు. ఇదివరకు ఆర్డీఓగా నియమితురాలైన అనురాధ పోస్టింగ్‌ను రద్దు చేస్తూ.. ఆమెను కర్నూలు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–4 ఎస్‌డీసీగా నియమించారు. కేఎస్ సాగర్ (పులిచింతల) ప్రత్యేక కలెక్టర్‌కు పీఏగా ఉన్న సి.వసంతకుమార్ హెచ్చెల్సీ ఎస్‌డీసీగా నియమితులయ్యారు. ఆత్మకూరు ఆర్డీఓ ఎస్.కరుణకుమారిని అనంతపురం ఆన్‌సెట్ సీఈఓగా నియమించారు. ఇక్కడ ఆన్‌సెట్ సీఈఓగా ఉన్న జి.కేశవనాయుడును పార్వతీపురం కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. కర్నూలు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్–2 ఎస్‌డీసీగా ఉన్న కె.మల్లికార్జునను అనంతపురం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ (ఎల్‌ఏ) ఎస్‌డీసీగా బదిలీ చేశారు. ఇక్కడ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌డీసీగా ఉన్న సుధారాణిని కర్నూలు నేషనల్ హైవే ఎస్‌డీసీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న జె.వరప్రసాద్ ఎస్‌ఎస్‌ఏ అదనపు కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. అనంతపురం పర్యాటక శాఖ ఆర్జేడీగా సి.వెంకట నారాయణమ్మను నియమించారు.

- కదిరి ఆర్డీఓగా ఎమ్.సన్నీ వంశీకృష్ణను నియమిస్తూ ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఉన్న ఎస్.రాఘవేంద్రరావును జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజాగా ఆయనను మదనపల్లి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ఎస్‌డీసీగా నియమించారు.

రాచపాళెం సాహిత్య శైలి విభిన్నం

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



అవార్డు అందుకుంటున్న రాచపాళెం

అనంతపురం కల్చరల్: 'విమర్శ' ప్రక్రియలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి శైలి విభిన్నమని గుర్రం జాషువా కళాపీఠం వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ కొనియాడారు. ప్రతిష్టాత్మక వ్యక్తులకందించే విమల స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అందుకున్నారు. ఆదివారం విమలా శాంతి సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని సాయిబాబా కళాశాలలో జరిగిన కార్యక్రమానికి రాజారామ్ అధ్యక్షత వహించారు. మాణిక్య వరప్రసాద్‌తో పాటు ఎస్కేయూ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ మేడిపల్లి రవికుమార్, డాక్టర్ శాంతినారాయణ, కళాశాల సెక్రటరీ డాక్టర్ నిర్మల, సీనియర్ కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో సునిశిత పరిశీలనతో విమర్శ చేసే దార్శనికుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధులైన రాచపాళెంకు విమల స్మారక సాహిత్య పురస్కామందించడం గర్వకారణమని కొనియాడారు. నానీల నాగేంద్ర సభాసమన్వయం చేయగా, తరిమెల అమరనాథరెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, శశికళ ఆప్తవాక్యాలను పలికారు. ఈ సందర్భంగా దాసరి ఆదినారాయణ ఆలపించిన గీతం అందరినీ ఆకట్టుకుంది. అంతకు ముందు దివంగత విమల చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కవులు, రచయితలు నబీర సూల్, షరీఫ్, కృష్ణమూర్తి, డాక్టర్ రసూల్, అశ్వర్థ రెడ్డి, సురేష్, రియాజుద్దీన్, ఆనంద్, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి, వన్నప్ప, గోసల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ



సత్యసాయి స్వర్ణరథానికి పూజలు చేస్తున్న రత్నాకర్ రాజు, చక్రవర్తి



పోలీసు ఆయుధాలు, వాహనాల వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో ఆదివారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో మహాసమాధి చెంత వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభించారు. సత్యసాయి ఉపయోగించిన కార్లు, సత్యసాయి బంగారు రథానికి ఆయుధపూజ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా సత్యసాయి నామం మార్మోగింది. రేడియోసాయి కార్యాలయం, పలు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయాల్లో ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి తదితరులున్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. దుర్గాదేవి చిత్రపటం వద్ద పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ మాధవరెడ్డి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఎస్బీ సీఐ రవీంద్రారెడ్డి, ఆర్‌ఐలు రాజశేఖర్‌రెడ్డి, టైటాస్, నారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధి.. అధికారుల బిజీబిజీ



ఈవీఎంలను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది. ఎలెక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే పూర్తి చేసింది. డబుల్ ఓట్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వత వలసదారులను గుర్తించిన సిబ్బంది.. అలాంటి వారికి నోటీసులు జారీ చేసి తొలగించే ప్రక్రియ చేపట్టారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకొనే వారికి ఫారం–6 అందజేసి జాబితాలో చేర్చారు. ఈ క్రమంలోనే ఈనెల 27 ముసాయిదా జాబితా ప్రచురించనున్నారు.

ఈవీఎంల రాక..

ఇటీవల ఈవీఎంల రాకతో వాటికి యాక్సెప్టెన్సీ పరీక్ష పూర్తి చేసి ధర్మవరం మార్కెట్ యార్డులో ఉంచారు. ఈవీఎంల పరిశీలనకు ఒక్కో రాజకీయ పార్టీ నుంచి ఒకరిని ప్రతినిధిగా ఆహ్వానించారు. మరోవైపు డీటీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, వీఆర్‌ఓ తదితర సిబ్బందికి 20 రోజుల శిక్షణ ఇస్తున్నారు. నోడల్ ఆఫీసర్ శివారెడ్డి సారథ్యంలో మొదటి దశ కార్యక్రమం వచ్చే నెల 10 వరకూ కొనసాగనుంది.

1,555 పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 1,555 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)కు సంబంధించిన బీయూ (బ్యాలెట్ యూనిట్), వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్), సీయూ (కంట్రోల్ యూనిట్)ల ఒక సెట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు, మరో సెట్ లోక్‌సభ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఈ మూడు యూనిట్లు కలిగిన ఈవీఎంను తనిఖీ చేసి సంతృప్తికరంగా ఉన్న వాటిపై ప్రత్యేక ముద్ర వేసి భద్రపరచనున్నారు. సమస్యలు తలెత్తితే, వాటి స్థానంలో కొత్త యూనిట్లు తెప్పించనున్నారు. ప్రస్తుతం జిల్లాకు బ్యాలెట్ యూనిట్లు 3,030, కంట్రోల్ యూనిట్లు 3,021, వీవీ ప్యాట్‌లు 3,030 వచ్చాయి. వీటిలో కొన్నింటిని పోలింగ్ సమయంలో వినియోగించనుండగా, కొన్ని సిబ్బంది శిక్షణకు ఉపయోగించనున్నారు.

27న డ్రాఫ్ట్ పబ్లికేషన్..

జిల్లాలో మరోవైపు ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇంటింటి సర్వే అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి జాబితాను పక్కాగా రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుంది. అనంతరం నెల రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ సమయంలోనూ కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి తొలగింపు, చిరునామాల మార్పులపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇవన్నీ పూర్తి చేసి వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. ఇక.. ఇప్పటికే జిల్లాకు వచ్చిన ఎపిక్ కార్డులను పోస్టల్ ద్వారా సంబంధిత వ్యక్తులకు చేరవేస్తున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..	
అసెంబ్లీ నియోజక వర్గాలు	6
లోక్‌సభ నియోజక వర్గం	1
పోలింగ్ కేంద్రాలు	1,555
బ్యాలెట్ యూనిట్లు	3,030
కంట్రోల్ యూనిట్లు	3,021
వీవీప్యాట్‌లు	3,030
ప్రస్తుతం జిల్లా ఓటర్లు	13,62,825 మంది

పకడ్బందీగా పరిశీలన

ధర్మవరం మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎంల పరిశీలన పకడ్బందీగా జరుగుతోంది. రాజకీయ పార్టీల ప్రతినిధులు, భెల్ కంపెనీ ఇంజినీర్లు, సిబ్బంది సమక్షంలో ఈ ప్రక్రియ సాగుతోంది. ప్రతి యంత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లాకు అవసరమైనన్ని ఈవీఎంలు వచ్చాయి. ఇక ఓటర్ల జాబితా తయారీ చురుగ్గా సాగుతోంది. సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



పెనుకొండ వద్ద పట్టుబడిన మద్యంతో సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: అక్రమంగా మద్యం, ఇసుక రవాణ చేస్తున్న వారిపై సెబ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆదివారం తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలో 4 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకుని,ట్రాక్టర్ సీజ్ చేశారు.పెనుకొండ, హిందూపురం కొడికొండ చెక్ పోస్ట్ ప్రాంతాల్లో 695 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న డీఎస్పీల ప్రీ పరేడ్



రిహార్సల్ చేస్తున్న డీఎస్పీలు

అనంతపురం క్రైం: శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలు పాసింగ్ అవుట్ పరేడ్‌పై ఆదివారం చేపట్టిన రిహార్సల్ ఆకట్టుకుంది. అనంతపురం పోలీసు శిక్షణా కళాశాలలో 28 మంది డీఎస్పీల శిక్షణ పూర్తయింది. సోమవారం వీరు కళాశాలను వీడనున్నారు. ఈ నేపథ్యంలో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహణకు సన్నాహాకాలు పూర్తయ్యాయి. కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. దీంతో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరేడ్‌ను పకడ్బందీగా నిర్వహించేలా నూతన డీఎస్పీలు అన్ని చర్యలూ తీసుకున్నారు. ఈ ప్రక్రియను శిక్షణ పీటీసీ ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అదనపు ఎస్పీ మల్లికార్జునవర్మ, డీఎస్పీ అల్లా బకాష్, సీఐలు, ఆర్ఐలు పర్యవేక్షించారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేత ట్రోఫీని అందుకుంటున్న మహిళల జట్టు

అనంతపురం: పూర్వ వాలీబాల్ ఆటగాళ్లు ముస్తఫా అలీఖాన్, నగేష్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆదివారం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ముగిసింది. నార్పల, పుట్టపర్తి, అనంతపురం హాస్పిటల్, అనంతపురం స్టేడియం పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే మహిళా విభాగంలో అనంతపురం స్టేడియం, లేపాక్షి, యోధ జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను అనంతపురం వాలీబాల్ సంఘం అధ్యక్షుడు బషీర్, చైర్మన్ సాయిప్రసాద్, సెక్రెటరీ వెంకటేశ్ నాయక్, ట్రెజరర్ శేషాద్రి అందజేశారు. న్యాయనిర్ణేతలుగా రాజేంద్ర గౌడ్, అనిల్, నాగరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం సభ్యులు దేవమ్మ, స్వర్ణ, కొండారెడ్డి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌తో దోపిడీకి చెక్

- ఔషధ దుకాణాలపై పూర్తి స్థాయి పర్యవేక్షణకు ప్రభుత్వ చర్యలు
- సీసీ కెమెరాలు, డిజిటల్ రికార్డుల నిర్వహణ తప్పని సరి చేస్తూ ఉత్తర్వులు జారీ
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవంటున్న డ్రగ్ కంట్రోల్ అధికారులు



పుట్టపర్తిలోని ఓ మందుల దుకాణం

ప్రశాంతి నిలయం: ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. పైసా ఖర్చులేకుండా పేదలకు మెరుగైన వైద్యమందేలా చర్యలు తీసుకోవడమే కాక, మందుల విక్రయాల్లో పారదర్శకత కోసం డిజిటలైజేషన్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానం ద్వారా మందుల దుకాణదారుల దోపిడీకి చెక్ వేసినట్లవుతోంది.

దోపిడీకి అడ్డుకట్టపడేలా...

సామాన్య ప్రజలకు మందు బిళ్లలపై అంతంత మాత్రమే అవగాహన ఉంటుంది. డాక్టర్ రాసిచ్చిన చీటీ తీసుకుని మందుల దుకాణంలో చూపించడం, వారిచ్చిన వాటిని తీసుకెళ్లి వాడడం తప్ప మరేమీ తెలియదు. ఈ పరిస్థితిని మందుల దుకాణదారులు తెలివిగా సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లో ఓ బ్రాండ్ మందు రాసిస్తే దానికి ప్రత్యామ్నాయ మందులు అందజేస్తూ మోసం చేస్తున్నారు. అంతేకాక బిల్లులు ఇవ్వకుండా అధిక ధరకు విక్రయిస్తున్నారు. మరి కొందరు డాక్టర్ల సిఫారసు లేకుండానే సొంత వైద్యం చేసేస్తూ మందులు విక్రయిస్తున్నారు. దీంతో కొన్ని కుటుంబాలు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం మందుల దుకాణదారుల దోపిడీకి అడ్డు కట్ట వేసేలా క్రయవిక్రయాలను పూర్తి డిజిటలైజేషన్ చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. మందుల దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, ఔషధాల నిర్వహణ, విక్రయానికి సంబంధించి బిల్లుల జారీ ప్రక్రియ మొత్తం కంప్యూటరీకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 600 మందుల దుకాణాలు ఉండగా.. ఇప్పటికే 250 దుకాణాల్లో డిజిటలైజషన్ ప్రక్రియ పూర్తయింది.

దుకాణాలపై పక్కా పర్యవేక్షణ

మందుల దుకాణాల నిర్వహణపై అధికారిక పర్యవేక్షణ లేకపోవడంతో దుకాణాల నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ వస్తున్నారు. మందుల విక్రయానికి సంబంధించి బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆర్ఎక్స్, ఎన్ఆర్ఎక్స్ మందులతోపాటు, మత్తు కారక మందులూ విక్రయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫార్మసీ పూర్తి చేసిన వారి సర్టిఫికెట్లను అద్దెకు ఏర్పాటు చేసుకుని పలువురు ఔషధ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ అంశాలన్నీ జిల్లా ఔషధ నియంత్రణ అధికారికి తెలిసినా తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో దుకాణదారులు అడ్డగోలు దోపిడీకి తెరలేపారు. ఈ క్రమంలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఉపక్రమించింది. మందుల దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంది.

అక్రమార్కులకు ఇక తిప్పలే

జిల్లా వ్యాప్తంగా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు గత ఆరునెలల కాలంలో చేపట్టిన తనిఖీల్లో 75 కేసులు నమోదయ్యాయి. పుట్టపర్తి, హిందూపురం, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో డాక్టర్ సిఫారసు లేకుండానే మందులు విక్రయిస్తున్నట్లుగా తనిఖీల్లో అధికారులు గుర్తించారు. కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ కిట్లు విక్రయించడం, నిషేధిత డ్రగ్స్, కాలం చెల్లిన మందులు అమ్మకం వంటి కారణాలతో ఈ కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయిస్తున్నాం. తప్పనిసరిగా మందుల దుకాణాల్లో సీసీ కెమెరాలతో పాటు, కంప్యూటర్ లావాదేవీలూ నిర్వహించాలి. నిషేధిత మందులు విక్రయిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేయడంతో పాటు నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తాం.

– రమేష్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, పుట్టపర్తి

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలోని స్కిల్ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ ఉంటుంది. ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన యువతీయువకులు అర్హులు. శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ శివప్రసాద్ (96767 06976)ను సంప్రదించవచ్చు.

డ్రిప్ పరికరాలకు నిప్పు



కాలిపోయిన పైపులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు పూలకుంట నరసింహప్ప పొలంలో డ్రిప్ పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దీంతో రూ. 1.50 లక్షల విలువైన డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.



విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వవిద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

గాండ్లపెంట: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారందరూ ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. దాదాపు పాతికేళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ మామా.... బావా అంటూ ఆప్యాయంగా పలకరించుకుంటూ సరదాగా గడిపారు. తమ తరగతి గదులు కలియతిరిగి పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు బాబూ ప్రకాష్, హరినాథరెడ్డి, కృష్ణమూర్తి, ఆదిరెడ్డి, లక్ష్మీనరసు, ముంతాజ్‌అలీను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తమ గుర్తుగా పాఠశాలలో తాగునీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు.

నిందితుల కోసం ముమ్మర వేట

- రంగంలోకి ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ బృందాలు
- ట్రాక్ వెంబడి విస్తృత తనిఖీలు

అనంతపురం సిటీ: కాచిగూడ–బెంగళూరు మధ్య తిరిగే వందేభారత్ రైలుపై రాళ్ల దాడికి పాల్పడిన దుండగుల కోసం జాయింట్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ నెల ఒకటిన ధర్మవరం సమీపంలో, 17న అనంతపురం శివారులో వందేభారత్ రైలుపై రాళ్ల దాడి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. 17 రోజుల వ్యవధిలో ఏకంగా రెండు పర్యాయాలు రాళ్ల దాడి జరగడంతో రైల్వే భద్రతా విభాగం అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో వందేభారత్ రైలు జిల్లాలోకి ప్రవేశించి సరిహద్దు దాటే వరూ ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది ట్రాక్ వెంబడి ముందస్తుగానే అనుసరిస్తున్నారు. ఎక్కడైనా అనుమానితులు, ఆకతాయిలు, తాగుబోతులు కనిపిస్తే వారిని అదుపులోకి తీసుకుని వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. మరో వైపు వందేభారత్‌పై ఇది వరకే రాళ్ల దాడికి పాల్పడిన దుండగులు ఎవరైందీ కనుక్కునే పనిలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ అధికారులు తలమునకలయ్యారు. రైలుకు అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజీల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. ఫుటేజీలు అందిన తర్వాత దుండగులు ఎవరైంది తేలే అవకాశముంది.

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సహించం

- చిలకం మధుసూదన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం: స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, తొండమాల రవి హెచ్చరించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవకు రాజకీయ రంగు పులిమి ఎమ్మెల్యే కేతిరెడ్డిపై చిలకం మధుసూదన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు ఖండించారు. ఆదివారం ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ మనుగడ కోల్పోయిన జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ధర్మవరంలో కుట్ర రాజకీయాలకు తెరలేపారన్నారు. గత శుక్రవారం రాజారెడ్డిపై దాడిని ఎమ్మెల్యేకి ఆపాదిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. రౌడీయిజం, కబ్జా, దందాలకు మారుపేరుగా ఉన్న మధుసూదనరెడ్డి.. గతంలో పరిటాల రవీంద్ర అండతో నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గాన్ని ఊచకోత కోయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎందరో వివాహితల తాళిబొట్లు తెంచి ఆ పాపం కడుక్కునేందుకు ఉచిత వివాహాలు చేయించిన మధు నైజం గురించి ప్రజలందరికీ తెలుసునన్నారు. హత్యానేరాల్లో చిక్కుకుని అజ్ఞాతంలోకి వెళ్లి తర్వాత కేతిరెడ్డి పెట్టిన భిక్షతో జనజీవన స్రవంతిలో కలిసిన మధుసూదన్‌రెడ్డికి ఎమ్మెల్యేని విమర్శించే నైతికత లేదన్నారు. ఎమ్మెల్యేపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు బడన్నపల్లి కేశవరెడ్డి, కోటిరెడ్డి బాలిరెడ్డి, చాంద్‌బాషా, ఎస్పీ బాషా, పెణుజూరు నాగరాజు, కుమారస్వామి, కృష్ణాపురం షహన్‌షా, చెలిమి పెద్దన్న, గుజ్జల శివ, కడప రంగస్వామి, కేశగాళ్ల కృష్ణ, చింతా యల్లయ్య, రాయపాటి రామకృష్ణ, కేతా లోకేష్, నీలూరి వెంకటరాముడు, బాలం గోపాల్, తోపుదుర్తి వెంకటరాముడు, జింకా కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో దసరా సంబరాలు



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

పుట్టపర్తి రూరల్: స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం దసరా సంబరాలు మిన్నంటాయి. శిల్పారామం పాలనా అధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శాస్త్రీయ నృత్యాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. దసరా విశిష్టతను వక్తలు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా పాటలు, డ్యాన్స్‌లతో యువత హోరెత్తించింది. కళాకారులకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలను పుట్టపర్తి అర్బన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు శ్రీనివాసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి

ముదిగుబ్బ/తలుపుల: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... తలుపుల మండలం వీరప్పగారిపల్లికి చెందిన శ్రీనివాసులు(27) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం అనంతపురంలో వైద్య చికిత్స చేయించుకుని భార్య మానసతో కలసి ఆమె పుట్టినిల్లైన నల్లమాడ మండలం వంకరకుంటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో మలకవేమల రైల్వే లెవల్ క్రాస్ వద్ద గేటు వేయడంతో ద్విచక్ర వాహనాన్ని ఆపి నీళ్లు తాగి వస్తానంటూ పట్టాలు దాటి అటువైపుగా వెళ్లాడు. కాసేపటి తర్వాత అటుగా వచ్చిన రైలు కిందకు దూరి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో బోగి తగిలి ఎగిరి పడి మృతి చెందాడు. మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి... కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి కారణాలు ఆరా తీసి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా సంయుక్త కార్యదర్శి కుర్లి శివారెడ్డి, వెంకటరమణారెడ్డి ఉన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

గోరంట్ల: స్థానిక మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్‌కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయమైంది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోరంట్లలోని ఎస్‌బీఐ శాఖలో నూర్ మహమ్మద్‌కు ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి నాలుగు విడతలుగా రూ.41వేలకు పైగా నగదు ఆయనకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు అపహరించారు. ఈ నెల 18, 19 తేదీల్లో రూ.23 వేలు, 20వ తేదీన రూ.8,900, 22న రూ.10వేలు మాయమయ్యాయి. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని గుర్తించిన ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ నిర్వహణ బాధ్యత రాజవంశీకులదే

- ప్రభుత్వ ఉత్తర్వుల జారీ
- రాజవంశీకులకు నకలు అందజేసిన ఎంపీలు, ఎమ్మెల్సీ



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీలు రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, రాజవంశీకులు, తదితరులు



ప్రభుత్వ జీఓ కాపీని అందుకుంటున్న రాజవంశీకుడు దొర రంగప్పరాజు

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయ నిర్వహణ బాధ్యతను దేవదాయశాఖ నుంచి తిరిగి రత్నగిరి సంస్థాన రాజవంశీకులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల నకలును ఆదివారం రాజవంశీకులకు ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ అందజేశారు. 2015లో గ్రామస్తుల అభ్యర్థన మేరకు మహాలక్ష్మి ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి చేరుస్తూ అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో వెలువరించింది. అనంతరం ఆలయ అభివృద్ధిని అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఆలయ నిర్వహణ బాధ్యత తామే తీసుకుంటామంటూ ప్రభుత్వం దృష్టికి రత్నగిరి సంస్థాన దొర రంగప్పరాజు తీసుకెళ్లారు. దీనిపై జగన్ సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ జీవో జారీ చేసింది. ఈ జీవో నకలును ఆదివారం రాజవంశీకుడు దొర రంగప్పరాజుకు అనంతపురం, హిందూపురం ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా స్వాగతించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీపీ కవిత, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీర, వాల్మీకి కులస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నంది విగ్రహం వద్ద పర్యాటకుల సందడి



ఏడు శిరస్సుల నాగేంద్రుడి విగ్రహం వద్ద ఫొటోలు తీసుకుంటున్న దృశ్యం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వేలాడే స్తంభం కింద నుంచి దుప్పట్టా లాగి పరిశీలిస్తున్న యువత

లేపాక్షిలో పర్యాటక సందడి

లేపాక్షి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకుని లేపాక్షి ఆలయం పర్యాటకులతో కిక్కిరిసింది. దుర్గామాత దర్శనం కోసం భక్తులు, పర్యాటకులు బారులు తీరారు. నాట్యమంటపం, కల్యాణ మంటపం, ఏడుశిరస్సుల నాగేంద్రుడి విగ్రహం, లతా మంటపం, నంది విగ్రహం, థీం పార్కు తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది.